రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

పతకాలు సాధించిన క్రీడాకారులు

కంఠేశ్వర్, జూలై 16 : హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14న నిర్వహించిన తెలంగాణ 7వ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లాలోని క్యూరియస్ తైక్వాండో అకాడమీకి చెందిన 38 మంది క్రీడాకారులు పాల్గొని 10 బంగారు, 5 రజత,8 కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ జిల్లా తైక్వాండో ప్రధానకార్యదర్శి వినోద్‌నాయక్, కోశాధికారి వినోద్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టులో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్క కోమరయ్య, ప్రధానకార్యదర్శి మీర్ వహాజ్ అలీఖాన్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

'కారుణ్య నియామకాలు చేపట్టాలి'

ధర్పల్లి, జూలై 16 : గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 61 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వీఆర్ ఏల డివిజన్ అధ్యక్షుడు చెలిమెల రాములు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వీఆర్‌ఏలు సుధీర్, గణేశ్, మురారి, జలంధర్ ఉన్నారు.

'విజయ్' విద్యార్థినికి నాట్యకిరణం అవార్డు

అద్వైతను అభినందిస్తున్న అమృతలత

ఖలీల్‌వాడి, జూలై 16: విజయ్ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం, తెలంగాణ బోనాల ఉత్సవాన్ని రవీంద్రభారతి వేదికగా ఈ నెల 14న నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్యంలో విజయ్‌పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అద్వైత రెడ్డి (ఏడో తరగతి) పాల్గొని 'నాట్య కిరణం' అవార్డును అందుకున్నది. అవార్డు అందుకున్న ఆమెను విజయ్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి మంగళవారం అభినందించారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగి మృతి

వినాయక్‌నగర్, జూలై16: మద్యం మత్తులో ఓ వ్యక్తి యాసిడ్ తాగి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఆరో టౌన్ ఎస్సై మొగిలయ్య తెలిపిన ప్రకారం..ఆటోనగర్‌కు చెందిన షేక్ మాజీద్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు పనికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం పని ముగించుకొని వస్తూ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న యాసిడ్‌ను మద్యం అనుకొని తాగగా కుటుంబీకులు గుర్తించి వెంటనే జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

బంగారు నగలు, నగదు అపహరణ

బీరువా నుంచి కిందపడేసిన వస్తువులు

వినాయక్‌నగర్, జూలై 16: నగరంలోని రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసి ఉన్న ఇండ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్, బ్యాంక్ కాలనీలోని ఓ ఇంట్లో, ఆరో టౌన్ పరిధిలోని ఆటోనగర్ ప్రాంతంలోని మరో ఇంట్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఆటోనగర్‌లో రావుఫ్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి భీంగల్‌లోని తన ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు నగలు, కొంత నగదును దోచుకుపోయారు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే కో-ఆపరేటివ్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కూతురు వద్దకు వెళ్లాడు. దుండగులు ఆ ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలను ధ్వంసం చేసి రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్సై పాండేరావ్ సంఘటన స్థలాన్ని మంగళవారం సందర్శించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు.

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. – ఆర్మూర్‌టౌన్, జూలై16

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులపై నిర్లక్ష్యం తగదు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

ఖలీల్‌వాడి, జూలై 16 : జిల్లాలో ప్రధానమైన లిఫ్ట్ ఇరిగేషన్ పంపుహౌస్‌ల వద్ద పని చేసే కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇరిగేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారులు, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ధర్నాలో రమేశ్‌బాబు మాట్లాడుతూ.. గుత్ప, అలీసాగర్ పరిధిలోని వివిధ పంపుహౌస్‌ల వద్ద పదేండ్ల నుంచి పనిచేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా, పీఎఫ్‌డబ్బులు జమ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కార్మికులతో తమకు సంబంధం లేదన్నట్లుగా అధికారులు మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలను, పీఎఫ్ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గణేశ్, మహిపాల్, కార్తిక్, సీతారాంనాయక్, బుచ్చన్న, అజయ్, నరేశ్, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డుల అందజేత

హెల్త్ కార్డులు అందజేస్తున్న బాధ్యులు

వినాయక్‌నగర్, జూలై 16: నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు మంగళవారం హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, అడ్వోకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యురాలు పరిపూర్ణ రెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు రాజు, వసంత్ రావు,సురేశ్, రాజ్‌కుమార్ సుబేదార్,దీపక్, అయూబ్, రాజేశ్వర్, కుమార్ దాస్, ఎల్ఎన్ శాస్త్రి, కవిత, ఇందుమతి, రజిత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తే చర్యలు

హెచ్చరిక బోర్డు వద్ద తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

రెంజల్, జూలై 16: మండల కేంద్రంలోని 340 సర్వే నంబర్‌లో రెండెకరాల ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జాచేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్ కార్యాలయ భవనం పరిధిలో 340 సర్వే నంబర్‌లో మూడెకరాల 30గంటల భూమి ఉందని, మిగతా ఎకరం 30 గుంటలు కోర్టు పరిధిలో ఉందని, రెండెకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని అన్నారు. ఈ భూమిని కబ్జా చేస్తే చట్టరీత్య చర్యలు తప్పవని స్థలం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో గిర్దావార్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్ చోరీ

పోతంగల్, జూలై 16: మండలంలోని కోల్లూరు గ్రామ శివారు వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో నుంచి కాపర్ కాయిల్స్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఏఈ నర్సారెడ్డి మంగళవారం తెలిపారు. రైతులకు చెందిన భూముల్లో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను కిందపడేసి అందులోని కాపర్ కాయిల్స్‌ను దొంగిలించారని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'పోరాటాల ఫలితంగానే వేతనాలు విడుదల'

ధర్పల్లి/డిచ్‌పల్లి, జూలై 16 : భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) పోరాటాల ఫలితంగానే గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రమేశ్ అన్నారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిధుల విడుదల కోసం (టీఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా అనేక రూపాల్లో ఉద్యమాలు, పోరాటాలు చేశామని తెలిపారు. కలెక్టరేట్ల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించి నిధులు విడుదల చేసేలా పోరాటం చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు దామోదర్, ఆశిష్, ఆశన్న, సాయిలు, సాయినాథ్, సులోచన, సాయవ్వ, శారద, విలాస్, రంజిత్, సంతోష్ పాల్గొన్నారు. డిచ్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్మికులు రాజేందర్, నర్సయ్య, సుమన్, బుచ్చయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

ఐఎఫ్‌టీయూ డిమాండ్

రుద్రూర్, జూలై 16: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో బీడీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులకులందరికీ రూ. 4,016 జీవనభృతి ఇవ్వాలని, కటాఫ్ డేట్ తొలగించాలని కోరారు. రేషన్ కార్డులు, సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీడీ కార్మికులు అరుణ్, కళావతి, లక్ష్మి, బుజ్జి, స్రవంతి, గంగామణి, లలిత, లత, సావిత్రి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

- **నోటు పుస్తకాల పంపిణీ:** ఖలీల్‌వాడి, జూలై 16: జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర ప్రభుత్వ పాఠశాలలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్, స్థానిక కార్పొరేటర్ బట్టు రాము , పాఠశాల సిబ్బంది జి.జ్యోత్స్న, సావిత్రి, సునీత, రాజు పాల్గొన్నారు.
- **ప్రశాంతంగా వన్‌టైమ్ చాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు :** డిచ్‌పల్లి, జూలై 16 : టీయూ అనుబంధ కళాశాలల పరిధిలో వన్‌టైమ్ చాన్స్ (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు 5వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, ఆర్మూర్‌లో కేంద్రాలు ఏర్పా చేయగా..ఉదయం 19 మంది విద్యార్థులకు 17 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 107 మంది విద్యార్థులకు 99 మంది హాజరుకాగా.. 8 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు.
- **తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా సంపత్:** రుద్రూర్, జూలై 16: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా సంపత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసిన వాసు బదిలీపై వెళ్లగా వికారాబాద్ నుంచి సంపత్ కుమార్ బదిలీపై రుద్రూర్‌కు వచ్చారు.
- **మడిగెలు పారదర్శకంగా కేటాయించాలి-** ఆర్మూర్‌టౌన్, జూలై16: పట్టణంలోని రైతు బజార్ మడిగెలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. నూతన మడిగెల కేటాయింపుపై అధికారులతో చర్చించారు. మడిగెలు కేటాయింపు పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ రాజు పాల్గొన్నారు.
- **సంచార పశు వైద్యశాల తనిఖీ-** ఆర్మూర్‌టౌన్, జూలై16: పట్టణంలోని సంచార పశు వైద్యశాల(1962)ను మంగళవారం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవి కుమార్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. పశువుల అంబులెన్స్‌లో ఉన్న మందులు, పరికరాలను పరిశీలించారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఆర్మూర్ సంచార పశు వైద్యుడు కాంతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- **బ్యాంకు సిబ్బందికి సన్మానం-** మాక్లూర్, జూలై16: గుత్ప గ్రామీణా బ్యాంకులో పనిచేసి ఉద్యోగోన్నతిపై వెళ్తున్న మేనేజర్ గోపీకృష్ణ, క్యాషియర్ ఇంద్రను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ విరంచిరెడ్డి, తాజామాజీ సర్పంచ్ చిన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **22న బోధన్‌లో ర్యాలీ-** శక్కర్‌నగర్, జూలై 16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న బోధన్ పట్టణంలో ర్యాలీ, అర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా బోధన్ సహాయ కార్యదర్శి బి. మల్లేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు, కర్షకులు, బీడీ కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఆర్మూర్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

కార్యాలయ గేటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

ఆర్మూర్‌టౌన్, జూలై16: పట్టణ అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ నూతన గేటును మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మూర్ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలని కోరారు. అధికారులు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Armoor Branch, Dist. Nizamabad agreed to accord Loan to Borrower: **Mundla Ramesh** S/o Mundla Mallaiah, Age 41 Yrs, Occ: Business, R/o H.No.6-6/1, Anksapur (V) Velpur (M), Nizamabad (Dist) on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE PROPERTY

The Open Place of Collapsed House bearing G.P H.No.6-41/1/1/B admeasuring total site area (48'-0" X 36'-0") = 1728 Sq.fts or 192.00 Sq.Yds or 160.53 Sq.Mtrs situated at Anksapur Village of Velpoor Mandal, Nizamabad district, within the limits of Gram Panchayat Anksapur, Mandal Parishad Velpur, District and Zilla Parishad Nizamabad, Registration District Nizamabad, Registration Sub District Bheemgal. **Bounded as below: North :** Open Place of Mundla Narsing, **South :** Main Road Armoor to Karimnagar, **East :** Open place of Gunti Rajamallu, **West :** House and Open place of Pandhena Nagubai

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhash Nagar, Nizamabad Cell:9848094409

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్, జూలై16: మున్సిపల్ పరిధిలోని పిప్రి రోడ్డు వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ రాజు మంగళవారం మొక్కలు నాటారు. పట్టణంలోని ప్రతి కాలనీలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. పాలకవర్గం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పంటల నమోదు వేగవంతం చేయాలి

పంటలను పరిశీలిస్తున్న డీఏవో వాజీద్ హుస్సేన్

నవీపేట, జూలై 16: వానకాలం పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో వానకాలం సీజన్‌లో ఏఈవోలు చేపడ్తున్న క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా చేపడ్తున్న సర్వేను పరిశీలించారు. రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగుచేసిన పంటల వివరాలను రైతులు యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఏఈవోలకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి సురేశ్‌గౌడ్, ఏఈవో వాసంత్ పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

ఏర్గట్ల, జూలై 16: ఇటీవల పదవీ బాధ్యతలు పూర్తి చేసుకున్న ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జక్కని మధుసూదన్‌ను మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మంగళవారం సన్మానించారు. గ్రామానికి, మండలానికి ఎనలేని సేవలందించారని అన్నారు. యువకులు బద్దం ప్రభాకర్, జైపాల్, మునిర్, నరేశ్, కుశ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో భారీవర్షం

మోర్తాడ్, జులై 16: మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వానకాలం ఆరంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అనుకున్నస్థాయిలో వర్షాలు కురవలేదు. సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు నాట్లు వేయడం ప్రారంభించారు. సోమవారం రాత్రి మోర్తాడ్‌లో 55.7, కమ్మర్‌పల్లిలో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్లు సత్యనారాయణ, ఆంజనేయులు తెలిపారు.

రెంజల్ మండలంలో 34.2 మిల్లీమీటర్లు..

రెంజల్, జూలై 16: సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మండలంలో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు.

స్మృతి మందిరం పనుల పరిశీలన

స్మృతి మందిరం పనులను పరిశీలిస్తున్న ఎంపీ

రెంజల్, జూలై 16: మండలంలోని కందకుర్తిలో డాక్టర్ బలిరాం హేడ్గేవార్ పూర్వికుల స్థలంలో నిర్మాణంలో ఉన్న స్మృతి మందిరాన్ని ఎంపీ ధర్మపురి అరవింద్ మంగళవారం పరిశీలించారు. డాక్టర్ జీవిత చరిత్ర గ్యాలరీ, పైన ఆడిటోరియంలో భారతమాత, ఎగ్జిబిషన్, రెండు వేల ఏండ్ల పురాతన స్కంధ మాత ఆలచ జీర్ణోద్ధారణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి గ్రామాన్ని ధార్మిక కేంద్రంగా ఏర్పాటు చేయాలని పుష్కర ఘాట్ చైర్మన్ తంబాకు గంగరాజు ఎంపీకి వినతిపత్రం అందించారు. ఎంపీ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించి 2025 దసరా నాటికి వంద ఏండ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా 2026 వరకు శత జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

మాక్లూర్, జూలై 16: మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి పాండురంగ విఠలేశ్వర ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం పూజలు నిర్వహించనున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, బిగాల మహేశ్‌గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

చేప పిల్లలకు బదులుగా నగదు ఇవ్వండి

పోతంగల్, జూలై 16: ప్రభుత్వం మత్స్యకారులకు అందజేసే చేప పిల్లలు నాణ్యతగా లేకపోవడంతో నష్టపోతున్నామని పలువురు మత్స్యకారులు అన్నారు. చేప పిల్లలకు బదులుగా నగదు అందిస్తే నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దార్ మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం తమకు మోపెడ్లు, వలలు అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు మక్కయ్య, కాల్లూరి మక్కయ్య, గంగారాం, సాయిలు, లింగం, లాలయ్య పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, క్రీడా పరికరాల పంపిణీ

బోధన్ రూరల్, జూలై 16: కేవీరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాలూరా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, క్రీడా పరికరాలు అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేశారు. వీటిని కేవీరెడ్డి మనుమడు ప్రభురెడ్డి దంపతులు విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం అల్లె రమేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేల్పూర్, జూలై 16: మండల కేంద్రంలోని జాన్కంపేట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వనజ, కస్తూర్బా స్కూల్ స్పెషల్ ఆఫీసర్ వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టులు 1- హెడ్‌కుక్ (విద్యార్థత 10వ తరగతి), రెండు అసిస్టెంట్ కుక్ (విద్యార్థత 7వ తరగతి), 3 స్వీపర్ (విద్యార్థత 7వ తరగతి) ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పై పోస్టులకు వేతనం రూ.9750 ఉంటుందని, ఆర్హత, ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 18, 19, 20 తేదీల్లో ఎమ్మార్సీలో మండల విద్యాధికారికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఆర్మూర్‌టౌన్, జూలై16: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరు పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ సభ్యులకు మంగళవారం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై అవగాహన కల్పించామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎడపల్లి, జూలై 16 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ మండల కేంద్రంలో తహసీల్దార్ కె.ధన్వాల్‌కు ముదిరాజ్ కులస్తులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, చెరువులు, కుంటలపై బెస్తవారికి, ముదిరాజులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒడ్డెన్న, రాజ్‌కుమార్, నల్లిరాజు, ఆంజనేయులు, శేఖర్, మనోజ్, సాయిలు పాల్గొన్నారు.

వరద కాలువ పనుల పరిశీలన